గూడూరు వైసీపీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ మేరిగ



గూడూరు, జనవరి 10 :గూడూరు వైసీపీ అభ్యర్థిత్వంపై చాలాకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడినుంచి పలువురు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న పరిస్థితుల్లో వైసీపీ ఇన్‌చార్జిగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావు పేరును పార్టీ ఖరారు చేసింది.ఈ నేపథ్యంలో మేరిగ బుధవారం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అంగన్వాడీ ఉద్యోగుల నిరసన

వేతనాలు పెంచకుంటే మట్టి తిని బతకాలా?

తిరుపతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉద్యోగులు ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. సత్యవేడులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగించిన ఉద్యోగులు చేతుల్లో మట్టి వుంచుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు ఇవ్వకుంటే తాము మట్టి తిని బతకాలా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తిరుపతిలో అంగన్వాడీ ఉద్యోగులకు మద్దతుగా అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉద్యోగులపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని, అలాగే కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయుడుపేటలో అంగన్వాడీ మహిళలు కళ్ళకు గంతలు కట్టుకుని రిలే నిరాహార దీక్షలు కొనసాగించగా పుత్తూరులో రిలే దీక్షలు చేపట్టిన ఉద్యోగులకు టీడీపీ నాయకులు మద్దతు ప్రకటించడంతో పాటు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సూళ్ళూరుపేటలో అంగన్వాడీ ఉద్యోగులు సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించగా సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. గూడూరు కోట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, రేణిగుంట, చంద్రగిరిల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆయా ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.



సత్యవేడులో అంగన్వాడీ ఉద్యోగుల నిరసన

డీఐఈవో బాధ్యతల స్వీకారం



డీఐఈవో స్వర్ణలతను అభినందిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(విద్య), జనవరి 10 : ఇంటర్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి(డీఐఈవో)గా ఎ.స్వర్ణలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాగలాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈమెను జిల్లా ఎఫ్ఏసీ అధికారిగా నియమిస్తూ ఇంటర్ బోర్డు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసి ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పలువురు ఉద్యోగులు ఆమెను సన్మానించారు. కాగా ఇంతకుముందు డీఐఈవోగా పనిచేసిన విశ్వనాథ నాయక్ తిరిగి చిన్నగొట్టిగల్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు.



అంగన్వాడీ వర్కర్ల నిరసన

చంద్రగిరి, జనవరి 10: చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ల సమ్మె 30వ రోజుకు చేరింది. బుధవారం చంద్రగిరి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ముందు అంగన్వాడీ వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించి, భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాలపై సమీక్ష

చంద్రగిరి, జనవరి 10: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ సంక్రాంతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ పాలక మండలితో పాటు అన్ని విభాగాల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో 'గడప గడపకు'

చంద్రగిరి, జనవరి 10: చంద్రగిరి పంచాయతీలోని భారతీనగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, చంద్రగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, సర్పంచ్ రూపారామ్మూర్తి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



పాకాల, జనవరి 10: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేస్తూ బుధవారం పాకాలలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ సంఘ్ పాకాల బ్రాంచ్ కార్యదర్శి పీఎం.శివకుమార్ మాట్లాడుతూ 2004 జనవరి 1వ తేది నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అనేక ఉద్యోగుల కుటుంబాలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ శంకర్, తులసీరామ్‌రెడ్డి, చైతన్య కుమార్, హేమంత కుమార్, వెంకటేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు

పాకాల, జనవరి 10: దామలచెరువు పంచాయతీ, పేరసానిపల్లె పంచాయతీల పరిధిలో పలువురు తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్.జయదేవనాయుడు, మండల వైసీపీ కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి, మబ్బునేని రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో 8శాతం ఓట్లు పెంచేసుకున్నారు

● జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 10: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఒకేసారి 8శాతం ఓట్లను వైసీపీ నేతలు పెంచేసుకున్నారని, దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలని జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా నియోజవర్గంలో పెరిగిన ఓట్లు 2శాతం మించి ఉండదని, అయితే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 2.80లక్షల ఓట్లు ఉండగా నేడు 3లక్షల 8వేల ఓట్లు పెంచుకుని 8 శాతం ఓట్లు పెరగడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. వెంటనే ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టి దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం నిర్వహించే పార్టీల సమావేశానికి రాని వ్యక్తి మోహిత్‌రెడ్డి అని, అలాంటి వ్యక్తి రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం సాహేతుకం కాదన్నారు.జనసేన, టీడీపీ కలిసి అధికారంలోకి వచ్చాక నిజమైన అభివృద్ధి ఏంటో చంద్రగిరి నియోజకవర్గంలో చేసి చూపిస్తామన్నారు. జనసేన పార్టీ కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి మాట్లాడుతూ చంద్రగిరి ప్రజలకు తాయిలాలు పంపిణీ చేస్తే ఓట్లు పడుతాయనేది హాస్యాస్పదమన్నారు. జనసేన నాయకులు రఘు, మురళి, హరి, దిలీప్, కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా



వైసీపీ నేత చంద్రారెడ్డికి క్యాలెండర్, స్వీట్లు అందిస్తున్న సుధాయాదవ్

తిరుపతి రూరల్/ఎ ర్రావారిపాలెం, జనవరి 10: టీడీపీ అవకాశం కల్పిస్తే చంద్రగిరి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తానని ఓబీసీ పోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధిష్ఠానం పిలుపు కోసం ఎదురుచూస్తున్నానని, ఇప్పటికే మాజీ సీఎం చంద్రబాబుతో చర్చించానన్నారు. రెండు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్లు, స్వీట్లు నియోజకవర్గ వ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కాగా బుధవారం ఎర్రావారిపాలెం మండలంలోని నెరబైలు పంచాయతీలో క్యాలెండర్, స్వీట్ల పంపిణీని బడి సుధా యాదవ్ ప్రారంభించారు.

కబడ్డీ టోర్నీ విజేత గంగిరెడ్డిపల్లె



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం, జనవరి 10: ఆడుదాం ఆంధ్రలో భాగంగా రామాపురం వద్ద బుధవారం జరిగిన కబడ్డీ పోటీల్లో గంగిరెడ్డిపల్లె జట్టు విజేతగా నిలిచింది. అలాగే వాలీబాల్ పోటీల్లో కేకేవీపురం ప్రథమ విజేతగా నిలిచింది. వీరు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలను జడ్పీటీసీ ఢిల్లీరాణి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పీఈటీలు పాల్గొన్నారు.

తిరుమలలో పెరుగుతున్న శునకాల ఆగడాలు

● భయాందోళనకు గురవుతున్న భక్తులు

● ఆలయం వద్దకు వచ్చేస్తున్నా పట్టించుకోని వైనం



ఆలయం ముందు శునకం



జీఎన్సీ వద్ద దాడి చేసుకుంటున్న శునకాలు

తిరుమల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో రోజురోజుకూ శునకాల(కుక్కలు) బెడద పెరుగుతోంది. ఇప్పటికే అడవి పందులు యథేచ్ఛగా తిరుగుతుంటే ఇపుడు వీధి కుక్కలు తయారయ్యాయి. ఆలయ పరిసరాల్లో తిరుగుతూ భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా స్వామి ఆలయం ముందుకే వచ్చేస్తున్నా టీటీడీ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం. సాధారణంగా తిరుమలలో వీధి కుక్కలు కనిపిస్తే హెల్త్ సిబ్బంది పట్టుకుని తిరుపతికి తరలించాలి. అయితే కొన్నాళ్లుగా వారి నిర్లక్ష్య ధోరణి కారణంగా తిరుమలలోని దుకాణాలు, హోటళ్లు, కాటేజీలు, యాత్రికుల వసతి సముదాయాల వద్ద, కాలినడకమార్గాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. బుధవారం ఉదయం రెండు కుక్కలు మహద్వారం సమీపానికి వచ్చాయి. మామూలుగా శునకాల వెంట్రుకలు పడిన ప్రదేశం పూజకు పనికిరాదని పెద్దలు చెబుతుంటారు. ఈ క్రమంలో శునాలను అరికట్టాల్సిన బాధ్యత హెల్త్ విభాగంపై ఉంది. అనుకోకుండా ఆలయంలోకి ప్రవేశిస్తే పెద్ద అపచారంగానే భావించాల్సి వస్తుంది. మరోవైపు తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీ నగర్‌లోనూ వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలు అధికమయ్యాయి. పిల్లులు, శునకాలను పెంచకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కొందరు అవేవీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వాటి అరుపులకు చిరుతలు జనసంచారంలోకి వచ్చే అవకాశముందని ఫారెస్ట్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా హెల్త్ విభాగం అధికారులు అప్రమత్తమై భక్తులకు శునకాల భయాన్ని తొలగించాల్సిన అవసరముంది.

బూమ్లింగ్ బడ్స్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు



చంద్రగిరి, జనవరి 10: చంద్రగిరిలోని బూమ్లింగ్ బడ్స్ స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో స్కూల్‌కి వచ్చారు. స్కూల్ ఆవరణలో గుడిసెలు వేసి దాని ముందు సంప్రదాయ వాతావరణం ఉట్టిపడేలా పచ్చ తోరణాలు, పందెళ్ళు వేశారు. ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి భోగి మంటలు వేశారు. అనంతరం గొబ్బెమ్మ పాటలు ఆలపించారు. సంప్రదాయ దుస్తులతో నృత్య ప్రదర్శన చేశారు. స్కూల్ ఛైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

దొంగ ఓట్లపై కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా?

● మోహిత్‌రెడ్డికి టీడీపీ నేత సవాల్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 10: చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు లేకుంటే కాణిపాకంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని టీడీపీ తిరుపతి రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని పక్కన పెట్టి ప్రజలకు తాయిలాలు ఎవరు పంచమని చెప్పారో చెప్పాలని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో 2.80లక్షల ఓట్లు ఉండగా నేడు 3లక్షల 8వేల ఓట్లు పెంచుకున్నారని విమర్శించారు. ఇందులో 18 ఏళ్ల నిండిన వారు కొత్త ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుంటారని, అయితే చంద్రగిరిలో విచిత్రంగా 40 ఏళ్ల పైబడిన వ్యక్తులు ఫాం-6 ద్వారా కొత్త ఓట్లను 47వేల మంది నమోదు కావడంపై ఇప్పటికీ విచారణ జరగకపోవడం దారుణమన్నారు. కనీస రాజకీయ అనుభవం లేకుండా 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయం అనుభవం ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను విమర్శించడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా విజ్ఞతతో ఆలోచించి మంచి అభ్యర్థిగా ఉండాలంటే రాజకీయాల్లో విలువలు పాటించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, కాయం వెంకటేష్, సురేష్‌కుమార్, శ్రీనివాసులు, నాగరాజు, గోపీనాథ్, శ్రావణ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజరావు

రామచంద్రాపురం, జనవరి 10: వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజరు, మైథిలి లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ రజితారెడ్డి, కెనరాబ్యాంకు సీనియర్ మేనేజరు ఉమాపతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టి.నాగరాజారావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రజితారెడ్డి మాట్లాడుతూ చక్కటి ఆలోచనలతో ముందస్తు ప్రణాళికలతో వెళితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఉమాపతి మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, గ్రూప్, వెస్టరన్ నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, కళాశాల కరస్పాండెంట్ ఎం.సుమలత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి మాన్యంలో మంత్రి గన్‌మెన్ అక్రమ నిర్మాణం



వేణుగోపాల స్వామి మాన్యంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చౌడేపల్లె, జనవరి10: చౌడేపల్లె బజారువీధిలోని వేణుగోపాల స్వామి ఆలయ మాన్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇద్దరు గన్‌మ్యాన్లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న దేవదాయశాఖ గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ నిర్మాణాలను పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ ఆలయ భూములు చౌడేపల్లెతో పాటు, వివిధ గ్రామాల్లో ఉన్నాయి. చౌడేపల్లె బస్టాండు సమీపంలోని మాన్యం భూమికి డిమాండుతో పాటు విలువ కూడా అధికంగా ఉంది. దీంతో కొంతకాలంగా రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తులు దురాక్రమణకు పాల్పడుతూనే ఉన్నారు. ఇక, మంత్రి పెద్దిరెడ్డికి గన్‌మేన్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరు విలువైన ఆ మాన్యం భూమిపై కన్నేశారు. కొన్ని రోజులుగా వేణుగోపాలుడి మాన్యం భూమినే కబ్జా చేసి నిర్మాణాలు శరవేగంగా చేస్తున్నారు. ఇంతకాలం రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కలెక్టర్ స్పందించి మాన్యం భూముల దురాక్రమణలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

అలిపిరి పాదాల మండపం పునర్నిర్మాణంపై స్పందించిన ఆర్కియాలజీ

17, 18 తేదీల్లో అలిపిరి, తిరుమలల్లో పర్యటించనున్న పురావస్తుశాఖ బృందం

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): అలిపిరి పాదాల మండపం పునర్నిర్మాణంపై ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా స్పందించింది. కూలిపోయే స్థితిలో ఉన్న పాదాలమండపం పరిశీలన నిమిత్తం పురావస్తుశాఖ అధికారుల బృందం రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 17వ తేదీన తిరుమలకు రానుంది. శిథిలావస్థలో ఉన్న తిరుమలలోని పార్వేటమండపాన్ని టీటీడీ గతేడాది తొలగించి ఆ స్థానంలో నూతన మండపాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. అయితే ఈ నిర్మాణంపై పలు రాజకీయపార్టీల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. పురాతన కట్టడమైన పార్వేటమండపం పునర్నిర్మాణ విషయంలో ఆర్కియాలజీ అనుమతిని టీటీడీ తీసుకోలేదని, చరిత్రను కనుమరుగుచేశారంటూ బీజేపీ విమర్శలకు దిగింది. అలాగే అలిపిరిలో భక్తుల విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పాదాలమండపం కూడా శిథిలావస్థకు చేరుకుందని అభిప్రాయపడిన టీటీడీ రూ.1.36 కోట్లతో పునర్నిర్మాణం చేయాలని గత ఏడాది అక్టోబరు నెలలో తీసుకున్న నిర్ణయంపై కూడా విమర్శలు వచ్చాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా పాదాల మండపాన్ని పరిశీలించి టీటీడీపై విరుచుకుపడ్డారు. అలాగే బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కూడా రాజసభలో మాట్లాడుతూ టీటీడీ పురాతన మండపాలను కూల్చివేస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పాదాలమండపం అంశంతో పాటు పుష్కరిణి వద్దనున్న అహ్నిక మండపాల పునర్నిర్మాణ అంశంపై పరిశీలన చేసి తగిన సూచనలు చేయాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి గతేడాది నవంబరు 30వ తేదీన ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. అయితే పురావస్తుశాఖ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఇదే అంశాన్ని ఈవో కేంద్ర సాంస్కృతిక శాఖ అడిషనల్ సెక్రటరీ రంజన్ చోప్రా దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో బుధవారం కేంద్ర పురావస్తుశాఖ నుంచి స్పందన వచ్చింది. మండపాల నిర్మాణంపై సాంకేతిక సహాయాన్ని అందించేందుకు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌కు చెందిన అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామని, ఈనెల 17, 18 తేదీల్లో తమ ఏఎస్ఐ అధికారులు తిరుమలలో పర్యటించనున్నట్టు ఆర్కియాలజీ విభాగం డైరెక్టర్ బుధవారం టీటీడీకి లేఖ ద్వారా తెలిపారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

తిరుపతి(విద్య), జనవరి 10 : ఏపీ ప్రభుత్వం ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల(ప్రభుత్వ, ప్రైవేట్)కు గురువారం నుంచి ఈనెల 17వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించిందని ఆర్ఐవో జీవీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సెలవుల్లో ఎటువంటి తరగతులూ నిర్వహించరాదని, బోర్డు నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాలలను తిరిగి ఈనెల 18న పునఃప్రారంభించాలని తెలిపారు.19నుంచి ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయని, షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా నిర్వహించాలని తెలిపారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో వివేకానంద జయంతి



తిరుపతి (కల్చరల్), జనవరి 10: తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్‌లో బుధవారం వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాగృతి సాంస్కృతిక సాహిత్య పోటీల విజేతలకు సత్వస్థానంద బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువతరం వివేకానందుని ఆదర్శంగా జీవితంలో ముందుకు సాగాలన్నారు. లక్ష్యం చేరే వరకూ విశ్రమించకండని పిలుపునిచ్చారు. సభలో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షురాలు గంగవరపు శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్వో కిషోర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 10 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు, అధికారులకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మాడ్యూల్స్ ప్రకారం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక ఏర్పాట్లను సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు సఫాయి కర్మచారి కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 10: సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు గురువారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి తిరుపతికి చేరుకుని బస చేస్తారని, 12న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టరేట్, ఎస్పీ, విద్యాశాఖ, హెల్త్, కార్మికశాఖ అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. అలాగే 13న వివిధ సమావేశాలకు హాజరై, 14వ తేదీ సాయంత్రం తిరుగు పయనమవుతారని వివరించారు.

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



రష్ ఆస్పత్రి వద్ద సంక్రాంతి సంబరాలు

తిరుపతి (రవాణా), జనవరి 10 : మన సంస్కృతీ సంప్రదాయాలతో కూడిన పండుగలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్సీ, రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. రష్ ఆస్పత్రి వద్ద బుధవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. గోవింద్‌రెడ్డి నర్సింగ్ కళాశాల విద్యార్థులకు, రష్ ఆస్పత్రి సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంప్రదాయ విలువలను చాటే పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రష్ ఆస్పత్రి వైద్యులు మౌనారెడ్డి, వీవీ కృష్ణ, గౌరి, శివకుమార్, బాబు, తేజస్విని, లీలావతి, రోజా, నూర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సమయం కేటాయించండి



మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి (ఆటోనగర్), జనవరి 10: వాకర్స్ ఉదయం, సాయంత్రం కొంత సమయం వ్యాయామం,వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చునని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. కేటీ రోడ్‌లోని రోటరీ భవన్‌లో బుధవారం నగర పరిధిలోని వాకర్స్ సంఘాల కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో డబ్బు సంపాదన వ్యామోహంలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. వాకర్స్ సంఘాలు మెడికల్ క్యాంపులు, కంటి పరీక్షలు, రక్తదానాలు వంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవరాజులు, వెంకటరెడ్డి, రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి రఘు, గోపి ప్రసాద్, రామమూర్తి, బి. రఘు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలి

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 10 : జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతన సవరణ చేయాలని తిరుపతి డివిజన్ నాయకులు వై.కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం భోజన విరామ సమయంలో తిరుపతి ఒకటవ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ జరపాలని, ఉద్యోగులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటముని, తీర్థానందరెడ్డి, బాలకృష్ణ, రమేష్, రాజశేఖర్, రామ్‌రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుచేస్తే సహించబోం..

ఆకస్మిక తనిఖీల్లో ఎస్వీయూ వీసీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 10: ఉద్యోగులు తప్పు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. యూనివర్సిటీలోని ఫైనాన్స్ బ్రాంచ్, స్పెషల్ సెల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగులు సమయానికి విధులకు హాజరుకావాలని, పనివేళల్లో కుర్చీలు ఖాళీగా ఉండకూడదని సూచించారు. ఏ ఫైలూ 12 గంటలకు మించి టేబుల్‌పై కనిపించకూడదని ఆదేశించారు. ఉద్యోగుల హాజరు, పనితీరు గురించి ఆయా సెక్షన్ల అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలతో యూనివర్సిటీలోని పలు విభాగాల ఉద్యోగులు అప్రమత్తమయ్యారు.

బస్సులో పుదుచ్చేరి మద్యం పట్టివేత

బాపట్ల జిల్లావాసి అరెస్టు



తడ, జనవరి 10: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న పుదుచ్చేరి రాష్ట్ర మద్యాని పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భీములవారిపాళెం చెక్‌పోస్టు సమీపంలో పోలీసు, డీఎస్పీ, ఎక్సైజ్, రవాణాశాఖ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోకి వచ్చే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చెక్‌పోస్టు వద్ద ఆగింది. అందులో నుంచి కిందకు దిగిన ఓ వ్యక్తి తనిఖీలను చూస్తూ ఖంగారుపడటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని అతని లగేజీని తనిఖీ చేశారు. బస్సులో నాలుగు అట్టపెట్టెల్లో దాచిన పుదుచ్చేరి రాష్ట్ర మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు బాపట్ల జిల్లా చెరకుపల్లి మండలం రాంబట్లవారిపాళెం గ్రామానికి చెందిన జూపూడి బేబేశ్వరరావుగా గుర్తించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఈ మద్యానికి అనుమతి లేదని, పరిమితికి మించి సరఫరా చేస్తుండటంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, సీఐ మధుబాబు, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది విజయకుమార్, నాగార్జున, రామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తిరుపతి



టీడీపీలోకి భీమాస్ బాలాజీ

తిరుపతి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : భీమాస్ రెసిడెన్సీ అధినేత దివంగత రఘు కుమారుడు, బీజేపీ నేత బాలాజీ బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో ఆయనకు పార్టీ నేతలు కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ విజయం కోసం కృషి చేస్తామని, చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

సెంట్రల్ బస్టాండు కంపు...కంపు..


బస్టాండులో పేరుకున్న వ్యర్థాలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 10: ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్ నలువైపులా వ్యర్థాలు పేరుకుపోయి కంపు కొడుతోంది. నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో నగరంతో పాటు బస్టాండులోనూ చెత్త పేరుపోయింది. ఇన్‌గేట్ వద్ద మూడు రోజులుగా చెత్తకుండీలు పూర్తిగా నిండి చెత్త దిబ్బలా పేరుకుపోయింది. కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీనికితోడు ప్రయాణికులు అక్కడ మూత్రవిసర్జన చేస్తుండడంతో కంపు తారస్థాయికి చేరింది. ఈగలు, దోమలు ప్రయాణికులపై దాడి చేస్తున్నాయి. దేశ నలువైపుల నుంచి వచ్చే ప్రయాణికులు దీన్ని చూసి అసహనానికి గురవుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్టాండులో చెత్తను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యాయవాదులకు జనసేన మద్దతు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 10 : ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ తిరుపతి కోర్టు ఆవరణలో న్యాయవాదులు చేస్తున్న నిరసనకు బుధవారం జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి బృందం మద్దతు తెలిపింది. ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ఆగడాలకు అదుపు లేకుండా పోతోందని, ప్రజల ఆస్తులపై ప్రభుత్వ పెత్తనమేమిటని ప్రశ్నించారు. ప్రజల కోసం నిలబడ్డ న్యాయవాదులకు జనసేన అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు బాబ్జి, హేమకుమార్, రాజేష్‌ఆచారి, గుట్టా నాగరాజు, మనోజ్, కిషోర్, వంశీ, పురుషోత్తం, పురుషోత్తంరాయల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబేడ్కర్ ఛాయాచిత్ర ప్రదర్శన


చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న జేసీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 10: సామాజిక సమతా సంకల్ప స్ఫూర్తిగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ముందుగా ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సమతా సంకల్ప (జన్ భాగీదారీ) కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అంబేడ్కర్ స్ఫూర్తిదాయక ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, కలెక్టరేట్ ఏవో జయరాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

13న తిరసం కవి సమ్మేళనం

తిరుపతి (కల్చరల్), జనవరి 10 : తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) ఆధ్వర్యంలో 13వ తేదీన సంక్రాంతి కవిసమ్మేళనం జరుగుతుందని కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్డు (ఎం.ఆర్.పల్లి)లోని యూత్ హాస్టల్లో సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తిరసం అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, తిరసంగౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు కవితా సమీక్ష చేస్తారని వివరించారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం

తిరుపతి (కల్చరల్), జనవరి 10 : గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో దివ్యప్రబంధ పారాయణం జరుగుతుంది. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో సేవాకాలం నిర్వహించారు. రాత్రి 7నుంచి 8 గంటల వరకు కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామికి ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల 20న చిన్నశాత్తుమొర, 26న ప్రణయ కలహోత్సవం, 30న పెద్ద శాత్తుమొర నిర్వహిస్తారు. ప్రారంభ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ పాల్గొన్నారు.

రాసానికి ఏపీ సాహిత్య అకాడమీ పురస్కారం



తిరుపతి (కల్చరల్), జనవరి 10: తిరుపతికి చెందిన కథకుడు, నవలా రచయిత డాక్టర్ రాసాని వెంకట్రామయ్యకు సంక్రాంతి సాహిత్య సంబరాల్లో విశిష్ట సాహిత్య పురస్కారం అందజేయనున్నట్లు ఏపీ సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఏలూరులో నిర్వహించే కార్యక్రమంలో పురస్కార ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. కాగా రాసాని రచయితగా ఇప్పటి వరకు 160 కథలు, 14 నవలలు, 30 నాటికలు, 8 నాటకాలు వెలువరించారు.

శ్రీవారి సేవలో హీరోయిన్ మీనాక్షి దీక్షిత్



తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి): సినీ హీరోయిన్ మీనాక్షి దీక్షిత్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన మీనాక్షిని చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు.

29నుంచి తిరుపతి - కాట్పాడి రైళ్ల రద్దు

పెరంబూర్, జనవరి 10: గుంతకల్ డివిజన్‌లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈనెల 29 నుంచి మార్చి 3వ తేదీ వరకు ప్యాసింజర్, మెమో రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.07659 తిరుపతి - కాట్పాడి ప్యాసింజర్ రైలు పూర్తిగా రద్దు చేస్తారు.
- నెం.07582 కాట్పాడి - తిరుపతి ప్యాసింజర్ రైలు పూర్తిగా రద్దు చేస్తారు.
- నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది.
- నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు

తిరుమల, జనవరి10(ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 65,901 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 16,991 మంది తలనీలాలు సమర్పించారు.

ఉపాధి హామీ కౌన్సిల్ మెంబర్ పదవీ కాలం పొడిగింపు


విశ్వనాథం

భాకరాపేట, జనవరి 10: ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ముత్తంశెట్టి విశ్వనాథం పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మరింత అంకితభావంతో విధులు నిర్వహిస్తానని తెలిపారు.

12న వివేకానంద జయంతి

తిరుపతి (కల్చరల్), జనవరి 10 : తిరుపతిలోని రామకృష్ణ ఆశ్రమంలో ఈనెల 12వ తేదీన వివేకానంద జయంతిని జాతీయ యువజనోత్సవంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎస్వీ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళి అర్పించి, రామకృష్ణ ఆశ్రమం వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 10 గంటలకు జరిగే సభలో గత డిసెంబరులో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు (సంచాలకులు, భారతీయ విద్యా భవన్, తిరుపతి), గౌరవ అతిథిగా డాక్టర్ మురళీకృష్ణ, (పూర్వ ప్రిన్సిపాల్, టీటీడీ ఆయుర్వేద కళాశాల, తిరుపతి), ప్రత్యేక అతిథిగా డాక్టర్ నిరంజన్ బాబు (ప్రిన్సిపాల్, సెవన్‌హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, తిరుపతి) హాజరవుతారని వెల్లడించారు.

అమ్మో జన ఔషధి..!

- స్విమ్స్ షాపులో ఎక్స్‌పైరీ మందులున్నట్టు గుర్తించిన నిపుణుల కమిటీ
- వైసీపీ పెద్దల అండతో చర్యలు శూన్యం

తిరుపతి- ఆంధ్రజ్యోతి



ఔషధాలను తక్కువ ధరకే ప్రజలకు అందించాలన్న ఉన్నతమైన లక్ష్యంతో ప్రారంభమైన జనరిక్ (జన ఔషధి) మెడికల్ షాపు స్విమ్స్‌లో గతితప్పి నడుస్తోంది. నాణ్యతా ప్రమాణాల తనిఖీలో దుకాణంలోని లోపాలు బయటపడ్డా వైసీపీ పెద్దల అండదండల వల్ల ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏడాదిన్నర కిందట ఒక గుండెచికిత్స రోగి మరణానికి మందులు ఇవ్వడంలో జరిగిన పొరపాటే కారణమని గ్రహించిన స్విమ్స్ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకూడదని దిద్దుబాటు చర్యలకు దిగింది. నిపుణులతో క్వాలిటీ ఆడిట్ చెక్ పేరిట ఒక కమిటీగా ఏర్పడి స్విమ్స్‌లోని మందుల షాపలను మూడు నెలలకోసారి తనిఖీచేసి, పరిశీలించిన అంశాలతో రూపొందించిన నివేదికను డైరెక్టర్‌కు అందజేస్తున్నారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఆర్.సుభాష్, మెడిసిన్ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంసీ ఆర్ రమ, జెనరల్ సర్జరీ వైద్యులు మునితేజ, రాజమణి, డ్రగ్ స్టోర్స్ నుంచి డాక్టర్ ఎర్రం రెడ్డి, క్లినికల్ ఫార్మాసిస్టులు డాక్టర్ ఎ.సాయికిరణ్, డాక్టర్ పి.అనూహ్య, డాక్టర్ జె.సుచరిత, డాక్టర్ టి.సునీత తనిఖీలు నిర్వహిస్తుంటారు.

షాపులో ఎక్స్‌పైరీ మందులు

జనరిక్ మందుల షాపులో గత ఏడాది మార్చి 15, జూన్ 28, డిసెంబరు 13న తనిఖీలు నిర్వహించగా కాలం చెల్లిన, ఎక్స్‌పైరీ దగ్గర పడిన మందులు ఉన్నట్టు కమిటీ గుర్తించిందని తెలిసింది. వాంతులు ఆగేందుకు వాడే ఆండోస్టెరాన్, మెటాక్లోప్రామైడ్, కొలస్ట్రాల్ తగ్గించే, రక్తం పలుచనకు వినియోగించే రోసువాస్టాటిన్, యాస్ప్రిన్ అండ్ క్లోపిడ్రజల్, యాంటీబయాటిక్ సెఫిక్సిమ్, అజిత్రోమైసిన్, నైట్రోఫ్యురంటోయిన్, గాయాలకు పూసే పొవిడన్ ఐయోడిన్, గ్యాస్ట్రైటిస్‌కి వినియోగించే రాబెప్రజోల్, ఆల్బెండజోల్, ప్రీ ప్రో బయాటిక్, నరాల నొప్పులకు వాడే గబాపెంటిన్, మిథైల్‌కోబాల్మిన్, కఫం పలచన చేసే ఎసిటైల్‌సిస్టైన్, యాంటిబయాటిక్స్ సెఫడాక్సిమ్ ప్రాక్సిటల్ అండ్ పొటాషియమ్ క్లావల్నేట్ ఓరల్ సస్పెన్షన్ (ఏప్రిల్-2023) ఎక్స్‌పైరీ అయిపోయినప్పటికీ షాపులో ఉండడం చూసి తనిఖీ బృందం విస్తుపోయింది. అదేవిధంగా బీపీకి వినియోగించే టెల్మాసార్టన్, ఆమ్లోడిపిన్ మందులు, జ్వరం, నొప్పులకు వాడే పారాసెటమల్, డైక్లో సపోజిటరీస్ ఎక్స్‌పైరీ డేట్ సమీపంలో ఉన్నప్పటికీ వాటిని విక్రయించేందుకు ఉంచడాన్ని కమిటీ తప్పుబట్టిందని తెలుస్తోంది.

● అయినా మారని తీరు

పీఎంబీజేకేలో 90 శాతం ఉండాల్సిన జెనరిక్ డ్రగ్స్ 30శాతానికి మించిలేవని తనిఖీ బృందం గుర్తించింది. జన ఔషధి మందులు ఉండాల్సిన చోట సర్జికల్ ఐటెమ్స్ ఆయుర్వేదిక్ ఉత్పత్తులు, పలురకాల బ్రాండెడ్ మందులే ప్రధానంగా షాపులో ఉంచినట్టు గుర్తించిందంటున్నారు. శీతల ఉష్ణోగ్రత (ఫ్రిడ్జ్)లో నిల్వ చేయాల్సిన మందుల స్థానంలో పూలు, ఇతర వస్తువులు ఉంచడాన్ని తనిఖీ బృందం తప్పుబట్టింది. అర్హతగల ఫార్మాసిస్టులు లేరని, షాపు మొత్తం అపరిశుభ్రంగా ఉండడాన్ని కమిటీ సభ్యులు గుర్తించారు. హైరిస్క్ మెడిసిన్స్, ఎమర్జెన్సీ మందులు ప్రత్యేకంగా నిల్వ చేయలేదని, మందుల షాపునకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలు కూడా లేవని తేల్చారు. గత ఏడాది 13న జరిగిన తనిఖీలో కేవలం 20శాతం మందులు మాత్రమే పీఎంబీజేకే జనరిక్ మందుల షాపులో ఉన్నట్టు గుర్తించారు. ఇవన్నీ నివేదికలో పొందుపరిచినట్లు తెలుస్తోంది. జనరిక్ బదులు ఖరీదైన మందులనే ఎక్కువగా విక్రయిస్తున్నారని, సర్జికల్స్ ఐటెమ్స్ కూడా విక్రయిస్తున్నారని నివేదికలో పేర్కొన్నారు. ఎక్స్‌పైరీకి దగ్గరగా ఉన్న లిక్విడ్ పారాఫిన్, మిల్క్‌ఆఫ్ మెగ్నీషియా, సోడియం పికోసల్ఫేట్ మందులు అమ్మకానికి పెట్టి ఉన్నారు. పీఎంబీజేకే నిబంధనలకు అనుగుణంగా మందుల విక్రయం జరగడంలేదని తేల్చారు. ఆ తర్వాత వారంలో సమాధానం చెప్పాలని గతంలో షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చారు. నివేదికను స్విమ్స్ డైరెక్టర్‌తో పాటు ఎన్‌ఏబీహెచ్ సెల్‌కు కూడా పంపారు. అధికార పార్టీ పెద్దల అండ ఉండడం వల్ల ఏ మార్పూ లేదని చెబుతున్నారు. ఇందువల్లే స్విమ్స్ పెద్దలూ ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

'జయహో బీసీ' జయప్రదం చేద్దాం

టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో తీర్మానం


సమావేశంలో టీడీపీ నేతలు

తిరుపతి, జనవరి10(ఆంధ్రజ్యోతి) : బీసీలను చైతన్యపరచడానికి ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమాలను తిరుపతి నియోజకవర్గాలో జయప్రదం చేయాలని టీడీపీ సమన్వయ కమిటీ తీర్మానించింది. బుధవారం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సుగుణమ్మ, నరసింహ యాదవ్, అబ్జర్వర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమం ద్వారా నారా లోకేశ్ బీసీల కష్టాలను తెలుసుకుని, వారికి తగిన విధంగా అజెండా రూపొందించుకుని ప్రభుత్వపరంగా రాబోయే రోజుల్లో తగిన సహాయ సహకారాలు అందించే దిశగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అన్నివిధాలుగా ఆదుకున్నారని గుర్తుచేశారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందన్నారు. పూర్వవైభవం రావాలంటే అందరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని, ఈనెల 18న తిరుపతిలో జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు దంపూరి భాస్కర్, విజయలక్ష్మి, ఇనుగొండ సుబ్రమణ్యం, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, రుద్రకోటి సదాశివం, పుష్పావతి, కుమారమ్మ, విశ్వనాథం, మధు, శాంబోళ హరినాథ్, ఆముదాల తులసీదాస్, సుధాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ కార్యాలయంలో నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో జయహో బీసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలోనూ కార్యక్రమం నిర్వహించాలన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివంతో పాటు నాయకులు రెడ్డివారి గురువారెడ్డి, దశరథాచారి, మునస్వామి యాదవ్, మనోహర్, చెంగయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న లాయర్ల రిలే దీక్షలు

తిరుపతి(లీగల్), జనవరి 10 : ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు నిరసనగా తిరుపతి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్ష 3వ రోజుకు చేరుకుంది. బుధవారం మాజీ ఎంపీ చింతా మోహన్, రాయలసీమ పోరాట కమిటీ కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి మద్దతు పలికారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.దేవరాజులు, నగరాధ్యక్షుడు రాజశేఖర్, టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మావిళ్ల హరీష్, న్యాయవాదులు ఆనంద్, రమేష్, హరికృష్ణ, వెంకటేశ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 10 : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని దిశా డీఎస్పీ కాటమ రాజు అన్నారు. బాల కార్మిక రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీఐడీ విభాగం ఆపరేషన్ స్వేచ్ఛ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం దిశా డీఎస్పీ ఆధ్వర్యంలో పద్మావతి ఫార్మసీ నుంచి తిరుచానూరు పూడి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురువారం వరకు ఆపరేషన్ స్వేచ్ఛ జరుగుతుందని, ఇందులో భాగంగా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా పోలీసుశాఖ పలుచోట్ల 8మంది బాల కార్మికులకు విముక్తి కల్పించి తల్లిదండ్రులకు అప్పగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, మండల లీగల్ సర్వీసు శాఖ అథారిటీ సభ్యులు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ శివాజీ, పోలీసు, లేబర్ శాఖ సిబ్బంది, శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మాను రద్దు చేయండి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నేతల డిమాండ్



తిరుపతి (రవాణా), జనవరి 10 : అంగన్వాడీలపై ఎస్మాను రద్దు చేసి, వెంటనే వారి జీతాలు పెంచాలని అఖిలపక్ష నేతలు కోరారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను ఎస్మాతో నిరోధించలేరని అన్నారు. షోకాజ్ నోటీసులిచ్చి అంగన్వాడీ సిబ్బందిని భయపెట్టలేరన్నారు. ప్రభుత్వం నిర్బంధం ఆపి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే రాష్ట్ర బంద్‌కు వెనకాడబోమని హెచ్చరించారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఓవీ రమణ, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సురేంద్రనాథ్, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె చట్టబద్ధమైందని, నిర్బంధాలతో దాన్ని ఆపలేరని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే 2024లో జగన్ ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ, జయప్రభ, ఎల్లమ్మ, గీత, గోమతి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సుజిత, సుశీలమ్మ, గంగ, ఐద్వా నాయకులు జయంతి, ఆటో యూనియన్ నాయకులు తంజావూరు మురళి, టీటీడీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పార్థసారథి, ఏఐటీయూసీ నాయకులు ఎన్‌డీ రవి, కేవై రాజా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో సెలవుల రద్దీ

- బస్సుల కోసం గంటలకొద్దీ నిరీక్షణ


శ్రీనివాస బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తిరుపతి(కొర్లగుంట), జనవరి 10 : సెంట్రల్ బస్టేషన్‌లో బుధవారం రద్దీ ఎక్కువగా కనిపించింది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో తిరుపతి కేంద్రంగా ఉన్న వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు తమ ఊర్లకు చేరుకునేందుకు బస్టాండు బాటపట్టారు. కడప, రాయచోటి, మదనపల్లె, పీలేరు, భాకరాపేట, అనంతపురం తదితర ప్లాట్‌ఫారాల వద్ద రద్దీ నెలకొంది. ఆర్టీసీ యంత్రాంగం అదనపు బస్సులు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయింది. బస్సులు ఏ మాత్రమూ సరిపోకపోవడంతో విద్యార్థులు లగేజీ బ్యాగులతో సీట్ల కోసం బస్సుల వెంబడి పరుగులు తీయడం కనిపించింది. బస్సులు వచ్చీరాగానే వాటికి ఎదురేగి దారిలోనే ఎక్కేయడంతో కొంతమేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు కూడా బస్టాండులో ఇదే పరిస్థితి ఉంది. దాదాపు 100 టిమ్ మెషిన్లలో సాంకేతిక లోపం కొంత ఆలస్యానికి కారణమైంది. బస్టాండులో రద్దీ దృష్ట్యా చాలా మంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. చోరీలను అరికట్టేందుకు పోలీసులు, ఆర్టీసీ భద్రతా సిబ్బంది కలియ తిరుగుతూ అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. హిజ్రాలు, యాచకుల బెడద శ్రుతిమించింది.



ముందస్తు సంక్రాంతి సంబరాలు

తిరుపతి(విద్య), జనవరి 10 : టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు చేసి, ముత్యాల ముగ్గుల నడుమ భోగిమంటలు వేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు, అధ్యాపకులు కలసి గొబ్బిపాటలు పాడి అలరించారు. విద్యార్థుల జంగమదేవర వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సి.ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ ప్రపంచదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు గుర్తింపు ఉందని, రాబోవు తరాలకు మన సంస్కృతిని అందించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. అధ్యాపకులు పి.ప్రియవర్ధన్‌బాబు, వై.గంగాధరరావు, పి.ప్రసాద్, వై.మహేశ్వరయ్య, ఇ.లోకేశ్‌రెడ్డి, పి.ప్రసన్నలక్ష్మి, కేవీరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

22వ రోజు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె



తిరుపతి(విద్య), జనవరి 10 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాతమున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 22వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు మాట్లాడుతూ మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, హెచ్ఆర్ఏ, డీఏతో కూడిన వేతనాన్ని అందించాలని కోరారు. సీఎం జగన్ హామీప్రకారం సమగ్రశిక్షలోని అన్ని విభాగాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని నిర్ణయించాలని, 62ఏళ్ల కాలానికి పదవీవిరమణ చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. 34 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత


పట్టుబడిన సాయిచెందు

తిరుపతి (నేరవిభాగం), జనవరి 10 : ఎస్ఈబీ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.మనోహర్ బృందం బుధవారం డీబీఆర్ హాస్పిటల్ ప్రాంతంలో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ఒక యువకుడిని అదుపులోకి తీసుకుంది. తిరుపతికి చెందిన కొండేటి సాయిచెందుగా గుర్తించారు. అతని వద్ద 1.2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. అతనికి గంజాయి సరఫరా చేసిన వ్యక్తి వివరాలు సేకరించి, అరెస్టుకు చర్యలు తీసుకున్నారు. దాడుల్లో చిరంజీవి, వినోద్, శోభారాణి పాల్గొన్నారు.

సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయండి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 10 : ముఖ్యమంత్రి జగన్‌పై చీటింగ్ కేసు నమోదు చేయాలని తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఎమ్మార్‌పల్లి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పిన సీఎం ఐదేళ్లు కావస్తున్నా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులయాదవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుపత్రం అందజేస్తున్న తెలుగు యువత నేతలు

పుదుచ్చేరి మద్యం పట్టివేత

బాపట్ల జిల్లావాసి అరెస్టు



పట్టుబడ్డ మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజగోపాలరెడ్డి

తడ, జనవరి 10: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న పుదుచ్చేరి రాష్ట్ర మద్యాని పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భీములవారిపాళెం చెక్‌పోస్టు సమీపంలో పోలీసు, డీఎస్పీ, ఎక్సైజ్, రవాణాశాఖ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోకి వచ్చే అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చెక్‌పోస్టు వద్ద ఆగింది. అందులో నుంచి కిందకు దిగిన ఓ వ్యక్తి తనిఖీలను చూస్తూ ఖంగారుపడటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని అతని లగేజీని తనిఖీ చేశారు. బస్సులో నాలుగు అట్టపెట్టెల్లో దాచిన పుదుచ్చేరి రాష్ట్ర మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితుడు బాపట్ల జిల్లా చెరకుపల్లి మండలం రాంబట్లవారిపాళెం గ్రామానికి చెందిన జూపూడి బేబేశ్వరరావుగా గుర్తించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఈ మద్యానికి అనుమతి లేదని, పరిమితికి మించి సరఫరా చేస్తుండటంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ, సీఐ మధుబాబు, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది విజయకుమార్, నాగార్జున, రామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్ను కట్టలేదని దుకాణం ముందు చెత్త



దుకాణం ముందు చెత్తపోసిన పంచాయతీ సిబ్బంది

వరదయ్యపాళెం, జనవరి 10: ఓ దుకాణదారుడు పన్ను కట్టలేదని పంచాయతీ సిబ్బంది చెత్తను తెచ్చి దుకాణం ముందు వేసిన ఘటన వరదయ్యపాళెంలో చోటు చేసుకుంది.ఈ విషయమై దుకాణదారు సుధాకర్ మాట్లాడుతూ రూ.500 పన్నును ఒకేసారి రూ.750కి పెంచారని, ఒక షట్టర్ ఉన్న దుకాణానికి నాలుగు షట్టర్లు ఉన్న దుకాణాలకు ఒకే పన్ను వసూలు చేయడం కరెక్ట్ కాదన్నారు.కార్యదర్శి బసిరెడ్డిని వివరణ కోరగా తాము చెత్తపోయలేదని, పన్ను కట్టనందుకు దుకాణం ముందు చెత్త తీయడం లేదని చెప్పారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, జనవరి 10:ఉపాధిహామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు.ఏపీవో దేవరి, జూనియర్ ఇంజనీర్ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభలను విజయవంతంగా నిర్వహించాలి

గూడూరు, జనవరి 10: నియోజకవర్గంలోని ప్రతిమండలంలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి



జనార్దన్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, జనవరి 10: నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని శిరసనంబేడు దళితవాడకు చెందిన మల్లేపల్లి జనార్దన్(45) మంగళవారం సాయంత్రం పెన్నేపల్లి పీఎంకే పెట్రోల్‌బంకు వద్ద 71వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న వాహనం ఢీకొంది. తీవ్ర గాయపడిన జనార్దన్‌ను ఎస్‌ఐ శ్రీకాంత్ నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 సెల్‌ఫోన్ల రికవరీ

తడ, జనవరి 10: చోరీకి గురైన 27 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. గత 3 నెలల సమయంలో తడ పరిధిలో వివిధ చోట్ల సుమారు 27 సెల్‌ఫోన్లను దొంగలు చోరీ చేశారు. ఐఎంఈ నెంబర్ ద్వారా ఆ సెల్‌ఫోన్లను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఐఎంఈ నెంబర్‌తో పాటు ఆధార్‌కార్డును సమర్పిస్తే సెల్‌ఫోన్లను అందజేస్తామని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. సమావేశంలో సీఐ మధుబాబు, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గొట్టిప్రోలులో కబడ్డీ పోటీలు

నాయుడుపేట, జనవరి 10: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించి వారిలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరసా పొందయ్య, రోశమ్మ జ్ఞాపకార్థం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతి పండుగను పురష్కరించుకొని మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో గొట్టిప్రోలు కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో క్రీడలతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. మొదటి బహుమతిగా రూ. 30016, రెండవ బహుమతి రూ. 20116, మూడవ బహుమతి 10116 టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసారత్నం చేతుల మీదుగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గుంతలనే గుర్తించండి

కోట, జనవరి 10: గ్రామాల్లో భూగర్భజలాలను పెంపొందించే గుంతలను మాత్రమే గుర్తించాలని ఉపాధి ఏపీవో పూర్ణిమ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై క్షేత్ర సహాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వర్షాకాలం వెళ్లిపోయినందున ప్రస్తుత సీజన్‌లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు భాస్కర్‌బాబు, శాంతి, పరుశురామ్ పాల్గొన్నారు.

నేటినుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

తిరుపతి(విద్య), జనవరి 10: జూనియర్ కళాశాలలకు గురువారం నుంచి ఈనెల 17వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలవుల్లో ఎటువంటి తరగతులూ నిర్వహించరాదని, బోర్డు నిబంధనలు అతిక్రమించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాలలను తిరిగి ఈనెల 18న పునఃప్రారంభించాలని తెలిపారు. 19నుంచి ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయని, షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా నిర్వహించాలని తెలిపారు.





చిల్లకూరులో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ కల్యాణ్‌చక్రవర్తి - దక్కిలిలో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న రాంకుమార్ రెడ్డి

ఆడిద్దామంటే... ఆడేవారేరీ?

- మొక్కుబడిగా ఆడుదాం... ఆంధ్రా పోటీలు
- ఆసక్తి చూపని క్రీడాకారులు
- చిల్లకూరులో ఆలస్యంగా ప్రారంభోత్సవం
- మధ్యాహ్నం వరకు నిరీక్షించి వెళ్లిపోయిన యువత

చిల్లకూరు, జనవరి 10: గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్రా కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో క్రీడాకారుల నుంచి స్పందన రాకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆడుదాం... ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఉదయం 8గంటలకు హాజరు కావాలని క్రీడాకారులకు చెప్పడంతో వారు ఆ సమయానికే మైదానికి చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ 12గంటలు అయినా రాకపోకవడంతో క్రీడాకారులు వెనుదిరిగారు. దీంతో అధికారులు 12:40గంటలకు జడ్పీటీసీ మన్నెం శీనయ్య చేతుల మీదుగా క్రీడాపోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం 1:35గంటలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వచ్చి క్రీడజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నెం శీనయ్య, బాలకృష్ణరెడ్డి, దిలీప్‌రెడ్డి, యోగి, అశోక్, అనుదీప్, శ్రీనివాసులు, అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఆడుదాం.. ఆంధ్రా మండలస్థాయి క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలిరోజు కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి కొంతసేపు ఆటలు ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలి: స్థానిక బాలయోగి గురుకుల కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రారంభించారు. వైసీపీ నేతలు చింతల శ్రీనివాసులు రెడ్డి, మాదమాల నారాయణరెడ్డి, దక్కిలి పెంచలరెడ్డి, వెలికంటి చెంచయ్య, బండి రమేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కోళ్లపూడి వేణుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో మున్సిపాలిటీతో పాటు మండలంలోని సచివాయాల వారీగా ఆటల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన టీ షర్ట్, టోపీ నాసిరంగా ఉండడంతో వాటిని ధరించకుండా క్రీడాకారులు కింద పడేశారు. అయితే వాటిని వేసుకుని క్రీడల్లో పాల్గొనాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ప్రభుత్వం అందజేసిన దుస్తులు వేసుకుని క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు పోటీలు ముగిశాక ఓ వీధి కుక్కకు ధరింపజేసి సరదాగా గడిపారు. కాగా, క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సచివాలయ అడ్మిన్లు పోటీలు నిర్వహించకలేదు. అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మొక్కుబడిగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు క్రికెట్ పోటీల్లో శ్యామసుందరపురం, చెందోడు జట్లు తలపడాల్సి ఉంది. కొన్ని గంటలపాటు క్రీడాకారులు రాలేదు. ఇంతలో ఎంపీడీవో భవానీ, ఎంపీపీ అంజమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు క్రికెట్ ఆడి మిగతా క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తరువాత శ్యామసుందరపురం జట్టు సభ్యులు వచ్చినా చెందోడు జట్టు క్రీడాకారులు రాలేదు. దీంతో అధికారులు శ్యామసుందరపురం జట్టును విజేతగా ప్రకటించారు.

బాలాయపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలకు స్పందన కరువైంది. మండలంలోని నెడిగల్లు గ్రామం నుంచి వచ్చిన యువతులు కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఇంకో జట్టు రాకపోవడంతో నెడిగల్లు జట్టు సభ్యులనే రెండు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. అలాగే ఖోఖో కూడా వారి చేతనే ఆడించారు. జయంపు జట్టు క్రికెట్ కోసం రాగా వారిచేత వాలీబాల్ కూడా ఆడించారు. రామాపురం క్రీడాకారులకు కబడ్డీ పోటీలు మాత్రమే నిర్వహించారు. క్రికెట్ కూడా ఆడుతామని చెప్పినా అధికారులు అంగీకరించకపోవడంతో క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. అదేవిధంగా ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు ఎవరూ రాలేదు. దీంతో వైఎస్సార్ క్రాంతి పథం వీవోఏలు పాల్గొని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఎపీడీవో ప్రమీలారాణి, జయంపు సొసైటీ అధ్యక్షుడు వెందోటి కార్తిక్ రెడ్డి, రాయి దేవి కాచౌదరి తదితరులు పాల్గొన్నారు.







కోటలో క్రీడాకారులు రాకపోవడంతో క్రికెట్ ఆడుతున్న అధికారులు - బాలాయపల్లిలో ఒకే కబడ్డీ జట్టు సభ్యులను ఇరువైపులా నిల్చోబెట్టి ఫొటో దిగుతున్న అధికారులు - చిల్లకూరులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాలేదని పోటీలను ప్రారంభించకపోవడంతో వెళ్లిపోతున్న క్రీడాకారులు

ఈవీఎం, వీవీప్యాట్‌పై అవగాహన ఉండాలి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 10 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు, అధికారులకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మాడ్యూల్స్ ప్రకారం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక ఏర్పాట్లను సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

13న తిరసం కవి సమ్మేళనం

తిరుపతి (కల్చరల్), జనవరి 10: తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) ఆధ్వర్యంలో 13వ తేదీన సంక్రాంతి కవిసమ్మేళనం జరుగుతుందని కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్డు (ఎం.ఆర్.పల్లి)లోని యూత్ హాస్టల్లో సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తిరసం అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, తిరసం గౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు కవితా సమీక్ష చేస్తారని వివరించారు.

వైసీపీ ప్రభుత్వానికి పోయేకాలం దాపురించింది



రోడ్డుపై వంటవార్పుతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పుత్తూరు అర్బన్, జనవరి 10: వైసీపీ ప్రభుత్వానికి పోయేకాలం దాపురించిందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణలు స్పష్టం చేశారు. బుధవారం సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కార్మికులు వంటవార్పుతో నిరశన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగపూట కూడా కార్మికులు పస్తులతో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాల్సిన ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం అన్యాయమన్నారు. సమాన పనికి సమావే వేతనం, గ్రాట్యుటీ ప్రధాన డిమాండ్లు కాగా ప్రభుత్వం వాటిని తప్ప మిగిలిన డిమాండ్లపై చర్చిస్తామని చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పండుగ లోపు ప్రభుత్వం కార్మికుల డిమాండ్ల పట్ల సానుకూల నిర్ణయం ప్రకటించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు మహేష్, జిల్లా ఆఫీస్ బేరర్లు చంద్రబాబు, వైఎస్ మణి, నాయకులు పురుషోత్తం రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపి, కార్మిక నాయకులు అంకయ్య, యాకోబు, గణేష్, మిథున్, చక్రవర్తి, చంద్రమోహన్, మనెమ్మ, పద్మ, రమ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి



ఏఎం పురంలో రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారిణి

వడమాలపేట, జనవరి 10: మామిడి పూతదశలో తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి సౌజన్య చెప్పారు. బుధవారం మండలంలోని ఎంఎం పురంలో మామిడి తోటలను పరిశీలించారు. పూతదశలో బంక, పక్షి కన్ను, బ్యాక్టీరియా, బూడిద, మసి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని, దీనిని ముందస్తుగానే గ్రహించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పూత రావడానికి మల్లి కే ద్రావణం ఒక లీటర్ నీటికి పది గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెలుగు నివారణ కోసం హెక్సకొనజోల్ లేఆ డైమీథియేట్ ఒక లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిసి పిచికారీ చేయలన్నారు. పూతదశ వచ్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే కాయ నాణ్యతలో పెరుగుదల ఉంటుందని చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదిస్తే పూతలో ఏ తెగులు సోకిందో గుర్తించి సస్యరక్షణ చర్యలపై సూచనలిస్తామని చెప్పారు.

పుత్తూరు వార్తలు

ఎల్‌ఐసీ ఉద్యోగుల సమ్మె

పుత్తూరు టౌన్, జనవరి 10: ఎల్‌ఐసీ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో అధికారులు, సిబ్బంది బుధవారం మధ్యాహ్నం 12.30నుంచి 1.30 వరకు గంట పాటు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల సంఘ కార్యదర్శి గంగులయ్య, ఎన్‌ఎఫ్‌ఐఎఫ్ డబ్ల్యూఐ కార్యదర్శి రమేష్, ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తమకు వేతన సవరణ గడువు 18 నెలలు కావస్తున్నా అమలు చేయడంలేదని, కనీసం చర్చలకు కూడా పిలకవపోవడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ అజయ్‌బాబు, యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

నగరి అభివృద్ధి కోసం... మీ భవిష్యత్తు కోసం



తడుకు పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 10: నగరి నియోజకవర్గ అభివృద్ధి కోసం... ప్రజలకు మెరుగైన భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీకి, చంద్రబాబునాయుడుకు మద్దతుగా నిలవాలని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని తడుకు పంచాయతీలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య, సర్పంచ్ బొబ్బిలి యాదవ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, మీ కోసం మీ తెలుగుదేశం కార్యక్రమాన్ని జనసేన నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా అడుగంటిపోయిందని విమర్శించారు. కరెంటు బిల్లుల మోత, ఇంటి పన్ను, చెత్త పన్నుల బాదుడు తప్ప ఐదేళ్ల వైసీపీ పాలన వల్ల ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. తడుకు పంచాయతీ పరిధిలో కోట్ల రూపాయాల విలువైన గ్రావెల్‌ను వైసీపీ నాయకులు దోచుకుని సొమ్ము చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మైనింగ్ అక్రమాలపై విచారణ జరిపించి వైసీపీ నాయకులు తిన్న ప్రతి పైసాను కక్కించి పేదలకు పంచుతానని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ అక్రమాల పుట్ట పగులుతోందని ఎన్నికల తరువాత ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని తేల్చి చెప్పారు రాష్ట్రంతో పాటు ప్రతి కుటుంబం బాగుపడాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలని వివరించారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తున్నట్లు తెలిపారు. విజనరీ నాయకుడు చంద్రబాబునాయుడు వల్లే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గం అభివృద్ధి తన బాధ్యతని రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి జాలాజీ, గంగాధరం, ఆదిమండడి, దేశమ్మ, భాస్కర్, ఆదిలక్ష్మి, హరి, ఆదినారాయణ, లోకేష్, గోపి, మధు, కృష్ణకుమార్, ప్రశాంత్, కిషోర్, శంకర్, రాజేష్, మోహన్‌బాబు, రవి, రామ్మూర్తి, వెంకటముని, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలి: టీడీపీ



అంగన్వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ధనంజయులనాయుడు

పుత్తూరు అర్బన్, వడమాలపేట, జనవరి 10: ప్రభుత్వం భేషరతుగా దిగివచ్చి అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 30రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా వడమాలపేట టీడీపీ నేతలు బుధవారం దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. తమ వంతుగా రూ.15 వేలు అంగన్వాడీలకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ధనంజయులు నాయుడు మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచాలన్న అంగన్వాడీల డిమాండ్ న్యాయబద్ధమైనదని అన్నారు. నెల రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొంటుంటే ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం అన్యాయమన్నారు. పైగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీల వేతనాల పెంపు కోర్కెను నెరవేర్చాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చడం తథ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఆర్ పురం సర్పంచు మణిరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, రవిరెడ్డి, శివ రాయల్, రజని,నాగరత్న, మోహన తదితరులు పాల్గొన్నారు.

రైల్వేశాఖపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

పుత్తూరు అర్బన్, జనవరి 10: రైల్వేశాఖ తీరుతో విసిగిపోయిన స్థానికులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును అందుకున్న కమిషన్ చెన్నై కేంద్రంగా ఉన్న సదరన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసింది. వెంటనే స్థానికుల ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవడం పాటు పూర్తి వివరాలను తమకు అందించాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. మున్సిపల్ పరిధిలోని ఒంటిమిట్టకు వెళ్లేందుకు కేఎం అగ్రహారంలో ఉన్న రైల్వే గేటును దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ రైల్వే మూసివేసి ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జిని నిర్మించింది. అయితే చిన్నపాటి వర్షం కురిసినా బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోతోంది. దీంతో వర్షం పడితే ఒంటిమిట్టకు చెందిన స్థానికులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపో తున్నాయి. తమకు కలుగుతున్న ఇబ్బందుల దృష్ట్యా రైల్వేశాఖకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. గత నెలలో తుపాను ప్రభావం కారణంగా కురిసిన వర్షాలతో అండర్‌బ్రిడ్జి నిండి పోయింది. అప్పటి నుంచి స్థానికులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేదిలేక జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు గత నెల 19వ తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ మంగళవారం సదరన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు నోటీసులు ఇచ్చింది.

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎరికంబట్టు క్రీడాకారులు

నారాయణవనం, జనవరి 10: ఆడుదాం.. ఆంధ్ర క్రీడల్లో భాగంగా బుధవారం నారాయణవనంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎరికంబట్టు జట్టు విజయం సాధించి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడాకారులను వైసీపీ నేతలు, గ్రామస్థులు అభినందించారు.

వడమాలపేట: అప్పలాయగుంట, వడమాలపేట క్రీడా మైదానాల్లో ఆడుదాం.. ఆంధ్ర క్రీడలు ప్రారంభమయ్యాయి. వడమాలపేటలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఎస్‌బీఆర్‌పురం, వడమాల జట్టు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అప్పలాయగుంట క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో బానియుడు కండ్రిగ, అప్పలాయగుంట జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. బ్యాండ్మింటన్ పోటీల్లో ఎస్‌బీఆర్ పురం, వడమాల, వడమాలపేట, ఎస్‌వీ పురం జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఫైనల్ పోటీలు శుక్రవారం వడమాలపేటలో జరుగుతాయని మండల సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు తెలిపారు. క్రీడాకారులందరికీ మండల అభివృద్ధి అధికారి క్రీడా దుస్తులు, టోపీలు అందజేశారు.



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

టీడీపీతోనే శాంతి భద్రతల పరిరక్షణ



ప్రజలకు అభివాదం చేస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి జనవరి 10:టీడీపీతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని 13వ వార్డు పరిధిలో బుధవారం సుధీర్‌రెడ్డి దంపతులు ఇంటింటి ప్రచారం చేశారు.వైసీపీ పాలనలో ప్రజలకు భద్రత కరువైందన్నారు.బొజ్జల రిషితారెడ్డి, పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.కాగా వైసీపీ నుంచి శ్రీకాళహస్తి మండలం వేడం మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన సుమారు 50 మంది టీడీపీలో చేరారు. ఊరందూరులో సుధీర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.టీడీపీ నాయకులు కామేష్‌యాదవ్, దొరైరాజ్ రెడ్డి, పోలూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మీడియా ప్యానలిస్టుగా రమణారెడ్డి

శ్రీకాళహస్తి జనవరి 10: బీజేపీ జిల్లా మీడియా ప్యానలిస్టుగా రమణారెడ్డిని నియమించారు. శ్రీకాళహస్తి మండలం అమ్మపాలేనికి చెందిన రమణారెడ్డిని బీజేపీ జిల్లా మీడియా ప్యానలిస్టుగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బెస్త చంద్రప్ప బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో అధికారులు

శ్రీకాళహస్తి జనవరి 10: ముక్కంటి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి జనవరి 10: రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాళహస్తి మండలం గొల్లపల్లికి చెందిన వెంకటేష్ (41) ద్విచక్ర వాహనంపై బుధవారం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చాడు.తిరిగి ఇంటికి బయల్దేరగా అక్కుర్తి వద్ద గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్ళింది. తీవ్రంగా గాయపడి ఉన్న వెంకటేష్ స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

యానాదులను దగా చేసిన వైసీపీ

శ్రీకాళహస్తి జనవరి 10: యానాది సామాజిక వర్గాన్ని వైసీపీ ప్రభుత్వం దారుణంగా దగా చేసిందని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఎన్నికలకు ముందు యానాదులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక కార్పొరేషన్, బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాల మంజూరు, యానాది సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ, విదేశీ విద్యకు నిధులు వంటివి అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో యానాది సామాజిక వర్గ ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 10: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలు బుచ్చినాయుడుకండ్రిగలో ఎంపీడీవో సాయి పల్లవి బుధవారం ప్రారంభించారు.గ్రామ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.పల్లమాల, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో క్రికెట్, వాలీబాల్ ఆడించారు.పీడీలు కిషోర్‌కుమార్, మస్తాన్, హరిబాబు, కార్యదర్శులు ఇందిర, నందిని తదితరులు పాల్గొన్నారు.

12న రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి జనవరి 10: ఈనెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు యువతరం సేవా సమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం పానగల్ రోడ్డులో యువతరం సేవా సమితి కార్యాలయం వద్దకు దాతలు విచ్చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ముక్కంటి ఆలయంలో హీరో సుధీర్ బాబు

శ్రీకాళహస్తి జనవరి 10: ముక్కంటిని బుధవారం హీరో సుధీర్ బాబు, పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. హీరో సుధీర్ బాబు కుటుంబ సమేతంగా సహస్రలింగం వద్ద రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో పండితులు శేష వస్త్రంతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

సంక్రాంతి సంబరాలు

రేణిగుంట,జనవరి10:రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని శ్రీసాయి గణేష్‌విద్యాలయంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీపీ హరిప్రసాద రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ జె. ధనంజయరెడ్డి, డైరెక్టర్లు చెంచురెడ్డి, కుమార్‌రాజు, వైసీపీ నాయకులు జె. దయాకర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీ రావుకు రైల్ సేవా పురస్కార్ అవార్డు



రేణిగుంట,జనవరి10: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ స్థాయిలో రేణిగుంట సీటీటీఐ ఎస్వీ రావుకు రైల్ సేవా పురస్కార్ అవార్డు అందుకున్నారు.రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు చేసిన సేవలను గుర్తించి అధికారులు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.బుధవారం గుంతకల్లులోని డీఆర్ఎం సమావేశ మందిరంలో ఈ పురస్కారాన్ని డీఆర్ఎం మనీష్‌అగర్వాల్ చేతులమీదుగా అందుకున్నారు.డీసీఎం సోమశేఖర్ నాయుడు,సీనియర్ డీసీఎం చౌహాన్ పాల్గొన్నారు.

తెలుగుగంగ ఉప కాలువ దగ్గర ప్లాట్లు!

● అడ్డుకున్న అధికారులు



గంగ ఉప కాలువ పక్కన వేసిన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 10: మండలంలోని పలు గ్రామాలకు సాగు నీటిని సరఫరా చేసే తెలుగుగంగ ఉప కాలువను ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురైంది. శ్రీకాళహస్తి - తడ రోడ్డులోని నీర్వాకోట గ్రామంలో పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టా భూముల్లో ప్లాట్లు వేశారు. ఈ భూమి గుండా గతంలో తెలుగుగంగ ఉప కాలువ నిర్మించారు.అప్పట్లో ఈ భూమికి నష్టపరిహారం చెల్లించారు. ఈ భూమికి అధిక ధర పలుకుతుండడంతో కొంతమంది ప్లాట్లు వేసి కాలువ చివరి వరకు రోడ్డు ఏర్పాటు చేసి ఆక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగుగంగ అధికారులు కాలువకు సంబంధించిన భూమిలో రోడ్డు వేయరాదని బుధవారం పనులను అడ్డుకున్నారు.

సన్మానం

కేవీబీపురం జనవరి10: పాలేగారి సంఘ పార్లమెంట్ అధ్యక్షులుగా ఎన్నికైన వెంకటకృష్ణయ్యను టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు.పాలేగారి సంఘ నాయకులు రామయ్య, గోపాల్, ధనంజయులు, మునెయ్య, వెంకటేష్, మునిరత్నం, మణి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి పోటీలు

కేవీబీపురం, జనవరి10: ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి ఆటల పోటీలను ఎంపీడీవో రామచంద్ర బుధవారం ప్రారంభించారు.రాయపేడు, ఆదర్శ పాఠశాల, కేవీబీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ మరియు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

పోటాపోటీగా క్రీడా పోటీలు

వరదయ్యపాళెం, జనవరి 10: వరదయ్యపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు జరిగాయి. 13 సచివాలయాల పరిధిలో క్రీడాకారులకు బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వైసీపీ మండలాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, సర్పంచ్ జ్యోతి, దామోదర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మరదవాడ సర్పంచ్ కుమార్, పీఈటీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొందరికేనా రేషన్ సరుకులు

వరదయ్యపాళెం, జనవరి 10: ఏర్పేడు మండలం చిన్నపాండూరు పంచాయతీలోని వీకేఆర్‌ఐ కాలనీలో డిసెంబరు నెలకు సంబంధించి రేషన్ సరుకులను కొంతమందికే ఇచ్చారని కాలనీవాసులు వాపోతున్నారు. సరుకుల వాహనం కాలనీలోకి వచ్చిందన్నారు. అయితే పది మంది వేలిముద్రలు వేసుకుని వస్తామని ఇంత వరకూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వీడిన యువతి అదృశ్యం కేసు

వరదయ్యపాళెం, జనవరి 10: ఇటీవల తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యువతి ఆచూకీని కనుగొన్నారు. వరదయ్యపాళెం శాటిలైట్ కాలనీకి చెందిన నందిని(21) కనిపించడంలేదంటూ ఆమె తల్లిదండ్రులు విజయలక్ష్మి, మోహన్ ఈ నెల 6వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో బీఎన్ కండ్రిగ మండలం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మోహన్ అనే యువకుని ప్రేమించి పరారైనట్లు నిర్ధారించారు.విచారించగా ఇష్టపూర్వకంగానే మోహన్‌తో వెళ్లినట్లు నందిని వాంగ్మూలం ఇచ్చింది. దీంతో పోలీసులు వారిని తహసీల్దారు గౌరీశంకర్ వద్ద హాజరుపరిచారు.నందిని వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

టీడీపీని ఆదరించండి

శ్రీకాళహస్తి, జనవరి 10: ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలో బుధవారం ఇంటింటికీ మీ బొజ్జల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పొన్నారావు, వేమూరి బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, హేమాక్షి, శివశంకర్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, నిరంజన్‌బాబునాయుడు,నాగరాజునాయుడుగిరినాయుడు, చిరంజీవులునాయుడు, గణేష్‌నాయుడు,మనోహర్‌నాయుడు, సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

శ్రీకాళహస్తి జనవరి 10: తమ సమస్యలపై న్యాయం జరిగే పోరాటం ఆగదని అంగన్వాడీలు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద బుధవారం రిలే దీక్షతో సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ..తమపై దుర్మార్గంగా ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ,ఏఐటీయూసీ,ఐఎఫ్టీయూ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు దీక్షలు ఆగవు

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు ఆపేదిలేదని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధనమ్మ,ప్రభావతి హెచ్చరించారు.బుధవారం అంగన్వాడీలు యధావిధిగా విధులు బహిష్కరించి దీక్షల్లో పాల్గొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

సత్యవేడులో వినూత్న నిరసన

సత్యవేడు: తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె 30వ రోజుకు చేరుకుంది. సత్యవేడులో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం తట్టలో మట్టి నింపుకుని మానోట్లో మట్టి కొట్టొద్దు అంటూ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, డీవైఎఫ్ఐ నాయకుడు మురళి, అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సరళ, శాంతి, ఝాన్సీ, కాంతమ్మ, భారతి, మంజుల, చెందామరై, విజయ, పార్వతి, అనురాధ సుజాత, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్వాడీల సమ్మె



పిచ్చాటూరులో నినాదాలు

పిచ్చాటూరు, జనవరి 10: పిచ్చాటూరులో బుధవారం కూడా అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన మాట ప్రకారం వేతనాలు పెంచాల్సిందేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు రెండే అర్జీలు



సత్యవేడు, జనవరి 11: వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోంది. జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం తరహాలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం పేరుతో ప్రభుత్వం వినతులు స్వీకరించే కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు హాజరై క్షేత్రస్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ షేక్ జరీనా బేగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లేదు. కార్యక్రమానికి ప్రచారం కల్పించక పోవడంతో అర్జీదారులు కనిపించక కార్యక్రమం వెలవెలబోయింది.మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పెద్దఎత్తున హాజరు కాగా అర్జీలు మాత్రం రెండే రావడం గమనార్హం. దీంతో అధికారులు, సిబ్బంది కార్యాలయ ఆవరణలో గాలికబుర్లతో కాలక్షేపం చేశారు. కాగా దాసుకుప్పంలో ఏర్పాటు చేస్తున్న తారు మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు జారీ చేసిన ఎన్ఓసీని రద్దు చేయాలని ఒకఅర్జీ, పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయుల విగ్రహం ఏర్పాటు కోసం మరో అర్జీ వచ్చింది.

పండుగనాడు పస్తులేనా...?

సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలలుగా అందని జీతాలు

శ్రీకాళహస్తి జనవరి 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని వాపోతున్నారు. మరో మూడు రోజుల్లో సంక్రాంతి రానున్న నేపథ్యంలో జీతాలు అందక పోవడంతో పండుగరోజు పస్తులుండాల్సిందేనా అన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. ఆలయంలో సుమారు 250మంది సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పండుగలోగా జీతాలందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైల్వేలో నూతన పింఛను విధానం రద్దు చేయాలి



రేణిగుంట రైల్వే స్టేషన్ వద్ద మజ్దూర్ యూనియన్ రిలే దీక్షలు

రేణిగుంట,జనవరి10:రైల్వేలో నూతన పింఛను విధానం రద్దు చేసి,పాత పింఛను విధానం అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజన్ అదనపు సెక్రటరీ బి.ఎం.బాషా,జనరల్ బ్రాంచ్ కార్యదర్శి జి.సురేష్ కుమార్ డిమాండు చేశారు.రేణిగుంట రైల్వే స్టేషన్ పార్శిల్ కార్యాలయ సమీపంలో బుధవారం యూనియన్ రేణిగుంటశాఖ ఏర్పాటు చేసిన రిలేదీక్షలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛను ఉద్యోగుల హక్కు అని పాలకులకు తెలిసినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ప్రశ్నించారు.ఎం.వి. రమణ,ఎ. మునిరామయ్య, వై.ఎన్. బాబు,కె.శ్రీనివాసులు,రాజేష్, నరేష్,ఎస్ఎండి గౌస్,నారాయణ,నందిని, శాంతమ్మ,పర్విన్,తిరుపాలమ్మ,ఎ.ఆర్. సిన్నామునెయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్న మీద కోపంతో నారుమడి ధ్వంసం



కేవీబీపురం, జనవరి10: ఆస్తి భాగ పరిష్కారాల్లో తేడా రావడంతో అన్న పొలంలో నారుమడిని తమ్ముడే ధ్వంసం చేసిన వుదంతమిది.పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ఆదవరం గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు బత్తెయ్య, కృష్ణయ్య వున్నారు. వీరిద్దరికీ తండ్రి సంపాదించిన 1.82ఎకరాల నేల సంక్రమించింది. దీనిలో భాగ పరిష్కారాలు చేసుకున్నారు. అయితే బత్తెయ్య సొంతంగా సర్వే నెంబరు 114/1 22/పీలో 1.50సెంట్లు కొనుక్కున్నాడు. కృష్ణయ్య 20సంవత్సరాల క్రితమే తమిళనాడుకు వెళ్ళి స్థిరపడ్డాడు. ఇప్పుడు వచ్చి బత్తెయ్య కొనుగోలు చేసిన పొలంలో వాటా ఇవ్వమన్నాడు. అందుకు బత్తెయ్య నిరాకరించడంతో అతడికి చెందిన 10సెంట్ల నారుమడిని ధ్వంసం చేశాడు.